# గాలి వాన

**హో**రునగాలి. భోరున వర్షం. ప్రపంచమంతా గడగడలాడిపోతోంది. రహదారులు బందీ అయిపోయాయి. ఎక్కడి మనుషులు అక్కడే ఆగిపోయారు.

వరి, చెరకు, అరటి పంటలన్నీ సాష్టాంగనమస్కారం చేస్తున్నాయి ఈ బీభత్సానికి. రైతులు బతుకుతెరువు తోచక అల్లాడిపోతున్నారు. కూలీలు పనులులేక, పనులు ఈ గాలివానలో చెయ్యలేక; తిండిలేక బాధపడుతున్నారు. ఈ బీదవాళ్ల ఇళ్ల కప్పులన్నీ ఈ గాలివానలో ఎగిరిపోయాయి. ఈ వానలో చీకిన తాటాకులన్నీ కరిగిపోయాయి, వాళ్ళంతా గోడలమాటున నక్కి వాననించి కాపాడుకుంటున్నారు.

ఇక పశుసంపద అవస్థ చెప్పక్కర్లేదు. అవన్నీ చలితో గడ్డకట్టుకుపోయాయి. కొంత నష్టం కూడా వొచ్చేలా వుంది, వాటిని కట్టిన పాకల దూలాలు, కొన్నిచోట్ల చుట్టుపక్కల చెట్లు పడడంవల్ల.

అయితేనేం మన మిత్రుడు ఏం చేస్తున్నాడు? పెట్టిపుట్టాడు! బీదవాళ్ళని మాత్రం ఎవరు ఇట్లాంటి భవనాల్లో వుండొద్దన్నారు. మనదేశంలో ఇంకా ఇట్లాంటి నిషేధంలేదే. వాళ్ళేకోరి, నాటకానికని పూరిగుడిసెల్లో మకాంచేస్తూ, తాగుడికి సంపాదనంతా తగలేస్తుంటే ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు?

మేడమీద పెద్దగది. ఎలక్ట్రిక్ దీపాల కాంతుల్లో, ఇల్లంతా దేవేంద్రభవనంలా వుంది. తన ఫ్యాక్టరీ బాపతు సంగతి, సమాచారాలు సరిచూసుకుంటున్నాడు, పడకకుర్చీమీద కూచుని. తలుపులన్నీ వేసినమూలాన గది చాలా వేడిగా వుంది; బయట గాలివాన ప్రళయకాలపు సంగీతం పాడుతోనే వుంది. అది లోపలికి వింతస్వరంతో వినపడుతోంది.

అతను కాగితాలు చూసుకుంటూ, మధ్యమధ్య స్టౌ వెలిగిస్తున్న పద్మవైపు చూడకుండా వుండలేకపోతున్నాడు. ఆ వాతావరణం అట్లా అనిపిస్తోందిగావును!

మళ్ళీ ఛా! పద్మ నెప్పుడన్నా చూడొచ్చు. ఈ పని ముందుచూసుకోవాలి అనుకుంటాడు. తన ఫ్యాక్టరీలో వెయ్యివరకూ అన్నిరకాల కూలీలు వున్నారు. యుద్ధమయిపోయింది కదా,

ఇక వీళ్ల కరువుభత్యం తెగగోద్దామనుకుంటున్నాడు. దానివల్ల వచ్చే లాభనష్టాలు చూసుకుంటున్నాడు.

సాధారణంగా కార్మికసంఘాలంటే అతనికి గౌరవంలేదు. వాటిని గుర్తించడు. కాని యుద్ధపురోజుల్లో వాళ్ళు వారెఫర్ట్‌కి సహాయం చెయ్యడానికి, ఎక్కువకాలం పనిచేస్తుంటే, అంగీకరించాడు సంఘాన్ని-తనకి వార్ కంట్రాక్టుల వల్ల వొచ్చే లాభాన్ని తల్చుకుని.

పద్మ వెచ్చటి టీ పక్కని పెట్టింది.

అతను ఆవలిస్తూ కాగితాలని పక్కకి తోసి, పొగలు గక్కే ‘టీ’ని తాగాడు. అది అతనిలో కొత్తచైతన్యాన్నిచ్చింది.

పైన ఇంకా తుఫాను భీకరంగా పాడుతూనే వుంది. అది లోపలికి వింతస్వరంతోనే వినపడుతోనే వుంది.

పద్మ పెద్దకళ్ళను విప్పార్చి, ఇతన్ని, ఇతని గొప్పతనాన్ని తల్చుకుంటోంది. ఫ్యాక్టరీ కూలీల దృష్టిలో అతనెట్లాంటివాడో, అతను వాళ్ళనెట్లా దోచుకుంటున్నాడో తెల్సుకునివుంటే, అతనివైపు అంత ప్రేమగా చూడగలిగి వుండకపోను...

***

బయట గాలివాన కురుస్తోనే వుంది.

పైడయ్య ఇతని ఫ్యాక్టరీలో మెకానిక్.

ఇల్లంతా వర్షం కురుస్తోంది. ఒక్కొక్కసారి లేచినగాలికి గోడలుకూడా పడిపోతాయేమో అన్నంతభయంగా వుంటోంది.

తడవకండా నులకమంచం ఎత్తిపెట్టారు. రామి చంటిపిల్లవాడి నెత్తుకుని ఓ మూల నక్కికూచుంది. కప్పునించిపడ్డ నీళ్లు చింది మీదపడ్డప్పుడల్లా, ఆ చంటిపిల్లాడు చలికి వణుకుతున్నాడు. పైడయ్య ఎనిమిదేళ్ళ కూతురుతో ఓ మూల కూచున్నాడు. ఇద్దరూ ఒకటే దుప్పటి కప్పుకున్నారు.

ఎవరూకూడా ఏమీ మాటలాడడం లేదు.

పైడయ్య ఎరుగును, తనకి జ్ఞానం వచ్చినప్పటినించి, ఎప్పుడూ పనిచెయ్యకండా వుండలేదని, ఎప్పుడో రెండేళ్ళ క్రితం గావును, జరం వచ్చి నాలుగురోజులు పని మానేశాడు. అప్పుడుకూడా యజమాని జీతం తెగగొయ్యడం మానలేదు.

మొదటిరోజుల్లో అనుకునేవాడు, కష్టపడి సంపాయించుకుంటే మనం మాత్రం ఎందుకు ధనవంతులం కామని. కాని కష్టమే మిగిలింది, ధనంలేదు. తిండిమాత్రం గడుస్తోంది.

ఇప్పుడిప్పుడే తెల్సుకుంటున్నాడు, ఇది సమాజం లోపమేగాని, పెట్టిపుట్టడాలనేవి లేవని.

***

హోరునగాలి. భోరున వర్షం. ప్రపంచమంతా సంతోషంతో గంతులేస్తోంది. గాలివాన బాహ్యప్రపంచంలో కాదు. కొందరు స్వార్థపరుల మెదడుల్లో.

పంటలన్నీ శుభ్రంగా వున్నాయి. రైతులు ఈ గాలివానవల్ల తమకి వచ్చే లాభాలని తల్చుకుంటూ ఆనందంగా పనిచేసుకుంటున్నారు. కూలీలకి పనికిగాని, తిండికిగాని కొరతలేదు. వాళ్ళ గుడిసెలన్నీ చక్కగా నిర్మించుకుంటున్నారు.

అసలు సంగతి – "దేశంలో పెద్ద పరిశ్రమలన్నీ ప్రభుత్వపరం కావాలి" అని జాతీయ ప్రభుత్వంలో వున్న కమ్యూనిస్టులు తెచ్చిన తీర్మానం అంగీకరించబడింది. సమష్టి వ్యవసాయ క్షేత్రాలు కూడా ప్రతిచోటా వెలుస్తున్నాయి.

మన మిత్రుడి తల్లో పిడుగుపడినట్లుంది. ఈ వార్త ప్రకటించిన "హిందూ"ని కిందపడేసి, ఆకాశంలో నక్షత్రాలు లెక్కిస్తున్నాడు.

వెన్నెల కిటికీలోంచి లోపల పడుతోంది. పద్మ మామూలుగా టీ పట్టుకొచ్చింది. పద్మ మొహంలో ఇదివరకటి కళలు లేవు, కళ్ళు మాత్రం అంతేవున్నా, చాలా ఏళ్లు గడిచాయి మనంచూసి. ఇదివరకటి అందపు చిహ్నాలుమాత్రం పోలేదు.

"నాన్నా! నాకో" అని సరస తను బాలసంఘం పోటీలో పొందిన, ఎర్రటి నక్షత్రాన్ని చూపిస్తోంది. దాన్నిచూసి వొళ్లుమండి, విసిరేశాడు. సరస నెమ్మదిగా వెళ్ళి, దాన్ని తీసుకుని, రేడియో బల్ల నానుకుని, మూల నుంచుంది పెద్దకళ్ళతో కోపంగా చూస్తూ. పద్మచిహ్నాలు కొన్ని లేకపోలేదు...

పైడయ్య సంతోషానికి అంతులేదు.

తను దేనికోసం ఇన్నాళ్ళూ కార్మికసంఘాల ద్వారా పోరాడాడో అది ఈనాడు నెరవేరు తోంది– పరిశ్రమలను స్వార్థుల చేతుల్లోంచిపోయి, సమాజపరమౌతున్నాయి.

ఫ్యాక్టరీనుంచి ఇంటికి వస్తుంటే, పిల్లలు, భార్య సంతోషంతో ఆహ్వానిస్తున్నారు.

ఇదివరకటి పూరి గుడిసెలో కాదు అతని నివాసం. ఫ్యాక్టరీ క్వార్టర్సు!

హోరని గాలి, భోరున వర్షం.

స్వార్థపరుల తలల్లో, ఈ గాలివానలో వాళ్ల స్వార్థపరత్వం సాష్టాంగ నమస్కారం చేస్తోంది, మానవత్వానికి క్షమాపణ చెప్పుకుంటూ.

ఇది గాలివాన కాదు! విప్లవం!

*03. 02. 1946–ఆనందవాణి వారపత్రిక*